సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం। 25। డిసెంబర్। 2023



ఈ దారిలో నడవరాదంతే.!

ఈ రోడ్డులో ఎవ్వరూ నడవకూడదు' అంటూ.. దారిని టీడీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రాటకొండ మధుబాబు జేసీబీతో తవ్వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడు. -8లో



మహిమాన్వితుడు కాశినాయన

జ్యోతిక్షేత్రం ఆధ్యాత్మిక నిలయంగా భాసిల్లుతోంది. ఈ క్షేత్రంలో శ్రీ అవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 26, 27 తేదీల్లో జరగనున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 242 మెట్రిక్ టన్నులు



సింహాద్రిపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్, ముఖ్యమంత్రిని చూసి ఉత్సాహంగా కేరింతలు కొడుతున్న ప్రజలు





మహిళల ఆనందహేల



ఇడుపులపాయలో వైఎస్సార్ విగ్రహం వద్ద సీఎం నివాళి



ఆప్యాయంగా... ఆత్మీయంగా..

నేటి పర్యటన వివరాలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 8.15 గంటలకు గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 8.20 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 8.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 8.50 గంటలకు పులివెందుల పట్టణం భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 8.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 9.05 గంటలకు సీఎస్ఐ చర్చికి చేరుకుంటారు.
- 9.05 నుంచి 11.15 గంటల వరకు సీఎస్ఐ చర్చి ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 11.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.25 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 11.30 గంటలకు అక్కడ బయలుదేరి 12.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.10 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి వెళతారు.
- 01.20కు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారు.

- సొంత నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటన
- పేరు పేరునా పలకరిస్తూ.. కష్టసుఖాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రగతిపై సమీక్షలు చేస్తూ.. పురోగతికి బాటలు వేస్తూ సాగిన జననేత
- ఆత్మీయులు, బంధువులతో మాటామంతీ
- ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి
- కుటుంబసభ్యులతో కలిసి క్రిస్మస్ ప్రార్థనలు





ఇడుపులపాయలో పులివెందుల మండల నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి కడప: ఎంత బిజీగా ఉన్నా ప్రజలంటే ఎనలేని అభిమానం.. వాళ్ల కనిపిస్తే పలకరించకుండా వెళ్లని మనస్తత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతం. అందులోనూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పర్యటన అంటే అందరినీ పేరుపేరునా ఆప్యాయంగా పిలుస్తూ, కష్టసుఖాలు తెలుసుకుంటారు. సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరిస్తారు.

ఇడుపులపాయలో..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం తన పర్యటనలో ఆసాంతం ముఖంపై చిరునవ్వు చెదరకుండా అందరినీ పలకరించారు. ఇడుపులపాయలో ఉదయం వైఎస్సార్ ఘాట్ వద్ద నాన్న స్మృతిలో గడిపిన సీఎం తర్వాత అక్కడున్న ఇద్దరు చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. చర్చి వద్ద ప్రార్థనల సమయంలోనూ అక్కడికి వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులందరితోనూ కలివిడిగా ఉన్నారు. అక్కడ మరికొందరు పిల్లలతో కాసేపు సెల్ఫీలు, ఇతర ప్రజల కోరిక మేరకు ఫొటోలు దిగారు. కుటుంబ సభ్యులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ ఉల్లాసంగా గడిపారు.

సమీక్షలో సైతం..

ఇడుపులపాయలో నిర్వహించిన పులివెందుల మండల సమీక్షలోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త ఉత్సాహంతో కనిపించారు. అభివృద్ధి పనుల గురించి అందరితో ఆనందంగా మాట్లాడారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన సలహాలను చిరునవ్వుతో స్వీకరించారు. వారు చేసిన ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించారు.

అడుగడుగునా..

సింహాద్రిపురంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు. తన రాక కోసం ఎదురు చూస్తున్న ప్రజల కోసం ఆయన ప్రత్యేకంగా వాహనం ఎక్కకుండా నడుచుకుంటూ ముందుకు సాగారు. సీఎం జగన్‌ను చూడగానే జనం కేరింతలతో 'జై జగన్' అంటూ నినాదాలు చేశారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఆయన వైపు చేతులు ఊపుతూ ఆనందం ప్రకటించారు. ముఖ్యమంత్రి ఒక పక్క చిరునవ్వుతో చేతులు ఊపుతూ... మరో పక్క ప్రత్యేకంగా పలకరిస్తూ చుట్టూ ఉన్నవారందరికీ అభివాదం చేస్తూ రోడ్డు వెంట కదిలారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి అలా వైఎస్సార్ పార్కులోకి, అక్కడి నుంచి నూతన కార్యాలయాల సముదాయాల వరకు నడుచుకుంటూనే సీఎం ఉల్లాసంగా వెళుతుండగా, రోడ్డు పక్క నుంచి ఆయనను అనుసరిస్తూ వేలాదిమంది తరలారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో రోజు పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా..ఉల్లాసంగా సాగింది. బిజీ షెడ్యూల్ ఉన్నా ఏ ఒక్కరినీ నిరుత్సాహ పరచకుండా కనిపించినవారందరినీ ఆయన ఆత్మీయంగా పలకరించారు. సింహాద్రిపురంలో కార్యక్రమాల అనంతరం తిరిగి ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు వచ్చిన తర్వాత కూడా అందరినీ ఆనందంగా పలకరించారు.



సింహాద్రిపురంలో వైఎస్సార్ మెమోరియల్ పార్కును పరిశీలిస్తున్న సీఎం



తహసీల్దార్ కార్యాలయం రిజిస్టర్‌లో సంతకం చేస్తూ..



పోలీసుస్టేషన్ వద్ద గౌరవ వందనం స్వీకరిస్తూ..



సీఎం సూచనతో ఎంపీడీవో నూతన భవనంలోకి కుడికాలు పెట్టి ప్రవేశిస్తున్న జెడ్పీటీసీ రుక్సానారాణి, ఎంపీడీవో కృష్ణమూర్తి, చిత్రంలో ఎంపీపీ అరుణ ఉన్నారు

న్యూస్‌రీల్


'స్పందన' రద్దు

రాయచోటి టౌన్: ప్రతి సోమవారం తన కార్యాలయంలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం 'స్పందన' కార్యక్రమాన్ని క్రిస్మస్ నేపథ్యంలో తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ గిరీష పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఫిర్యాదులు అందజేయడానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎవరూ రావద్దని సూచించారు.

పచ్చమంద పిచ్చితనం

సంబేపల్లె : ప్రశాంత్ కిషోర్ విషయంలో పచ్చమంద పిచ్చితనం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం రాయచోటిలోని ఓ కళ్యాణ మండపంలో జరిగిన సంబేపల్లె మండల కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రశాంత్ కిషోర్‌ను నాడు బీహార్ దొంగ, పేటీఎమ్ బ్యాచ్, రౌడీ అని టీడీపీ నాయకులు కామెంట్లు చేశారన్నారు. అయితే నేడు అదే ప్రశాంత్ కిషోర్ వారితో కలిస్తే భారతంలో అర్జునుడిలా, రామాయణంలో రాముడిలా అభివర్ణిస్తూ ప్రచారం చేస్తున్నారని.. ఇది పచ్చమంద పిచ్చితనానికి, రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు.

'వాకర్స్' వీపీగా 'కొండూరు'



శరత్‌కుమార్‌రాజును సన్మానిస్తున్న దృశ్యం

రాజంపేట: వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండూరు శరత్‌కుమార్ రాజు ఎంపికయ్యారు. వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన సంస్థ 32వ వార్షికోత్సవంలో ఆయనకు ఈ పదవి దక్కింది. విశాఖ కేంద్రంగా ఉన్న ఈ సంస్థ 'నడువు, నడిపించు' అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. కాగా, శరత్‌కుమార్ రాజును రాజంపేట వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధులు చేజెర్ల సుబ్రమణ్యంరాజు, సుబ్బరామరాజు, కోనేటి రవిరాజు, రిటైర్డ్ అధ్యాపకుడు డా.పెంచలయ్య, కొమ్మి రామచంద్రనాయుడు తదితరులు విశాఖలో ఘనంగా సన్మానించారు.

నూతన పట్టణాల సృష్టికర్త సీఎం వైఎస్ జగన్



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి
- రూ. 35వేల కోట్లతో జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

పీలేరు: పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నూతన పట్టణాల సృష్టికర్తగా మారారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మదనపల్లె మార్గంలోని ఏపీ ఐఐసీ లేఅవుట్‌లో 4లో నాలుగో విడత ఇళ్ల పట్టాల కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 3300 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో పట్టణాలకు సమాంతరంగా జగనన్న కాలనీల రూపంలో పట్టణాలు రూపుదిద్దుకుంటున్నాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 35 వేల కోట్లతో జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో అన్ని వసతులతోపాటు పాఠశాలలు, ఆస్పత్రులు, పార్కుల ఏర్పాటుకు స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ముఖ్యమంత్రి ప్రజల వద్దకే పాలన తెచ్చారని అన్నారు. ఈ వ్యవస్థ కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం నుంచి మీ అందరికీ మేలు జరిగి ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు. గతంలో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. ప్రధానంగా డ్వాక్రా మహిళలను, రైతులను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికార దాహంతో ఎలాగైనా ఓట్లు రాబట్టుకోవాలనే దురుద్దేశంతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. అందులో భాగంగా ఉచిత హామీలు ఇస్తున్నారని, ఆయన కల్లబొల్లి మాటలను నమ్మరాదని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పీలేరులో ఎన్నడూలేని విధంగా చేసిన అభివృద్ధి చారిత్రాత్మకమని తెలిపారు. వంద పడకల ప్రభుత్వాస్పత్రి, అన్ని మతాలకు వేర్వేరుగా స్మశాన వాటికలు, పార్కులు, షాదీమహల్, మసీదుల అభివృద్ధి, రోడ్లు, ఆర్‌వో ప్లాంట్లు, బైపాస్ రోడ్డు, రెండు ఆర్‌వోబీలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి తమను ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిపించి ఆదరించాలని కోరారు. అనంతరం యల్లమంద క్రాస్‌లోని మసీదుకు రూ. 1.45 లక్షలు, సైనిక్ నగర్‌లో మసీదుకు రూ. 63 వేలు ఎంపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జీనత్‌షఫీ, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, ఏపీ హౌసింగ్, వేర్‌హౌస్ గోడౌన్ డైరెక్టర్లు కారపాకుల భాస్కర్‌నాయుడు, నాగరాజమ్మ, నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి, హబీబ్‌బాషా, హుమయూన్, దండు జగన్‌మోహన్‌రెడ్డి, మహితాఆనంద్, హరిత, ఎస్.వి. చలపతి, డాక్టర్ వెంకటరామయ్య, సునీల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, రాజేష్, చెంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం.. శరవేగం

- కొత్త...కొత్తగా ప్రాంతీయవైద్యశాలలు
- దాదాపు రూ.95కోట్ల వ్యయం
- అత్యాధునిక సేవలకు భవనాలు సిద్ధం
- జిల్లాల్లో ప్రాంతీయవైద్యశాలలకు మహర్దశ



రైల్వేకోడూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం

రాజంపేట: జిల్లాలో సెకండరీ హెల్త్ కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న పెద్దాసుపత్రులు కొత్త..కొత్తగా అవతరిస్తున్నాయి. అత్యాధునిక సేవలందించేందుకు భవనాలను సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోదాదాపు రూ.95 కోట్ల వ్యయంతో ఏరియా హాస్పిటల్స్ భవనాల నిర్మాణాలు శరవేగంతో కొనసాగుతున్నాయి. జిల్లాలో 8 ప్రాంతీయవైద్యశాలలకు మహర్దశ పట్టనుంది. పీలేరు, వాయల్పాడు(వాల్మీకిపురం), తంబళ్లపల్లె, కలికిరి, రాజంపేట, రాయచోటి, రాజంపేట , రైల్వేకోడూరులో ఉన్న ప్రాంతీయవైద్యశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ కేంద్రాల్లో ఉన్న పెద్దాసుపత్రులకు వాటి స్థాయిని బట్టి పునర్నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా అన్ని ఆసుపత్రులు నూతన హంగులను సంతరించుకున్నాయి.

కొత్త ఏడాదిలో అందుబాటులోకి..

జిల్లాలో నూతనంగా నిర్మితమవుతున్న పెద్దాసుపత్రుల భవనాలు కొత్త ఏడాది తొలిమాసంలో అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే 90శాతం పనులు పూర్తి చేసుకున్నాయి. చివరి దశలో ఏడు ఆసుపత్రులు కొత్త హంగులను రూపుదిద్దుకుంటున్నాయి.


నిధులు కేటాయింపులు ఇలా..

జిల్లాలో ప్రాంతీయ వైద్యశాలల నూతన భవనాల నిర్మాణాలకు, ఇత అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది. ఏపీఎంఎస్ఐడీసీ నేతృత్వంలో ఆసుపత్రి భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పీలేరుకు రూ.24కోట్లు, వాయల్పాడుకు రూ.7కోట్లు, తంబళ్లపల్లె రూ.4.65 కోట్లు, కలికిరి రూ.6.48 కోట్లు, రాయచోటి రూ.23కోట్లు, రాజంపేట రూ.22కోట్లు, రైల్వేకోడూరు 8.2 కోట్లు కేటాయింపులు జరిగాయి. ఈ నిధులతో భవనాల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి.

ప్రాంతీయవైద్యశాల	పడకల సామర్థ్యం
రాయచోటి	100
రాజంపేట	100
పీలేరు	100
వాయల్పాడు	50
కలికిరి	30
తంబళ్లపల్లె	30
రైల్వేకోడూరు	30




కార్పొరేట్ తరహాలో ప్రాంతీయ వైద్యశాలలు



రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని నియోజకవర్గాల్లో ఉన్న ప్రాంతీయ వైద్యశాలలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలు కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో రూపుదిద్దుకుంటున్నాయి. సీఎం వైఎస్‌జగన్‌మోన్‌రెడ్డి పాలనలో వైద్యానికి పెద్దపీట వేస్తున్నరనడానికి ప్రాంతీయ వైద్యశాలల అభివృద్ధే ఇదే నిదర్శనం.

-పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట


వైద్యుల కొరత లేకుండా చర్యలు



కొత్త ఏడాదిలో ఆసుపత్రుల భవనాలు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే ఏడు ఆసుపత్రులకు సంబంధించి భవన నిర్మాణాలు పూర్తికావస్తున్నాయి. వైద్యులు,సిబ్బంది కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. పేదలకు మెరుగైన వైద్య అందించే దిశగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సెకండరీ హెల్త్ విభాగం ముందుకెళుతోంది.

-డేవిడ్ సుకుమార్, డీసీహెచ్, సెకండరీహెల్త్ రాయచోటి,

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో పెద్దాసుపత్రులకు మహర్దశ పట్టడం శుభపరిణామం. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.ముఖ్యమంత్రికి పేదల ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఉంటాయి.

-బీ.గోపినాథ్, జేసీఎస్ జిల్లా కన్వీనర్(అనంతపురం)

క్లుప్తంగా

పట్టపగలు ఇంటిలో చోరీ

తంబళ్లపల్లె : గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు ఇంటిలో చోరీ చేసిన సంఘటన శనివారం సాయంత్రం మండలంలో జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలు.. కన్నెమడుగు పంచాయతీ కె.రామిగానిపల్లెకు చెందిన ఆర్.వెంకటసుబ్బారెడ్డి శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటికి తాళాలు వేసి వ్యవసాయ బోరు వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాగా గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ దూకి ఇంట్లోకి వెళ్లి బీరువా పగులకొట్టారు. అందులో రూ.40 వేల నగదు, 70 గ్రాముల బంగారు నగలు చోరీ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ విలేకరులకు తెలిపారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. చీకలబైలు పంచాయతీ దిగువమేడిపల్లెకు చెందిన మల్లికార్జున భార్య బి.నందిని(20) గత కొంతకాలంగా గర్భకోశవ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం సమస్య తీవ్రం కావడంతో స్థానికంగా లభించే విషపుకాయలు తిని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వజిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన నాగరాజ

వాల్మీకిపురం : విద్యుత్‌షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఫత్తేపురంలో చోటు చేసుకొంది. వివరాలు ఇలా.. విద్యుత్ శాఖలో హెల్పర్‌గా పని చేస్తున్న నాగరాజ (25) ఆదివారం విద్యుత్ మరమ్మతుల కోసం విద్యుత్ పోల్ ఎక్కాడు. ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ లైన్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.

108లో సుఖ ప్రసవం


పండంటి ఆడబిడ్డతో ఈఎంటీ ఫక్రుద్దీన్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం పంచాయతీ తోటవారిపల్లికి చెందిన నారాయణస్వామి భార్య భార్గవికి ఆదివారం పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. దీంతో పీటీఎం 108 ఈఎంటీ ఫక్రుద్దీన్, పైలెట్ నరసింహులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గర్భిణిని బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో వాహన సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వడంతో తల్లి, బిడ్డను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గండిలో ఘనంగా హనుమద్ వ్రతం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం హనుమద్ వ్రత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజా రమేష్, రాజగోపాలాచార్యులు నేతృత్వంలో టీటీడీ అర్చకులు ఈ వేడుక నిర్వహించారు. కంకణ ధారణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఈ దారిలో నడవరాదంతే.!

- 20 ఏళ్లుగా ఉన్న దారిని జేసీబీతో తవ్విన టీడీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి
- ఇరువర్గాల ఆధిపత్య పోరులో దారిలేక ప్రజలకు ఇబ్బందులు
- వివాదం కోర్టులో ఉండగానే భూమిని ఆక్రమించే ప్రయత్నం


రాటకొండ మధుబాబు (ఫైల్)

మదనపల్లె : 'ఈ భూమి మా పూర్వీకులది. ఇందులో మాకు భాగపరిష్కారాలు కాలేదు. వివాదం కోర్టులో నడుస్తోంది. అప్పటివరకు ఈ రోడ్డులో ఎవ్వరూ నడవకూడదు' అంటూ.. 20 ఏళ్లుగా దాదాపు 1,000 కుటుంబాలు వినియోగిస్తున్న దారిని టీడీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రాటకొండ మధుబాబు జేసీబీతో తవ్వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని సాయిచిత్ర థియేటర్‌కు సమీపంలోని గుర్రంపెద్దప్ప కాలనీ నుంచి రోజాఫ్లాట్స్ వరకు వెళ్లేందుకు 40 అడుగుల వెడల్పుతో రహదారి ఏర్పాటైంది. ఈ దారిలో ప్రతిరోజు దాదాపు 1,000 కుటుంబాలకు చెందిన ప్రజలు తమ అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. మున్సిపల్ అధికారులు ఈ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మార్గమధ్యంలో టీడీపీ నాయకుడైన మధుబాబు, మరో నలుగురి భూములకు సంబంధించి వివాదం కొంత కాలంగా జరుగుతోంది. ఈ క్రమంలో సీసీ రోడ్డు వేసేందుకు అభ్యంతరం తెలపడంతో మున్సిపల్ అధికారులు వివాద స్థలానికి అటు, ఇటు కొంతస్థలం వదలి రోడ్డు పూర్తిచేశారు. వదలిన స్థలంలో వర్షం వచ్చిన ప్రతిసారి నీళ్లు నిలిచి, పెద్ద ఎత్తున గోతులు ఏర్పడటం, దారిలో ప్రయాణిస్తూ పలువురు గాయపడి ఆస్పత్రుల పాలవడం జరిగింది. దీంతో స్థానికంగా ఉన్న వారు కొంత విరాళాలు పోగుచేసుకుని, రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చి రాకపోకలకు అనుగుణంగా తయారుచేసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకుడు ప్రభుత్వ సెలవుదినమైన ఆదివారం తనను ఎవరూ అడ్డుకోలేరని భావించి, సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఉన్నపళంగా జేసీబీని తీసుకువచ్చి మూడుచోట్ల దారిని తవ్వి ప్రజలు అటు నుంచి ఇటు వచ్చేందుకు వీలులేకుండా చేశారు. దీంతో స్థానికులు అతడిని కలిసి మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌లో రోడ్డును అప్రూవల్‌గా కనపరచడం, విద్యుత్, వాటర్‌పైప్‌లైన్ ఈ దారి వెంబడే ఉండటంతో తాము లక్షలు వెచ్చించి ఇళ్ల స్థలాలు కొనుగోలుచేసి, నిర్మాణం జరిపి నివసిస్తున్నామని, ఇప్పుడు దారి తవ్వేస్తే తమ పరిస్థితి ఏంటని నిలదీశారు. అయితే టీడీపీ నాయకుడు మీ ఇబ్బందులతో మాకు పనిలేదని, భూమిలో తమకు భాగం రావాల్సి ఉందని, ఎవరైనా అతిక్రమించి రాకపోకలు జరిపితే కేసులు పెడతానని బెదిరించాడు. ఇదిలా ఉండగా.. కోర్టు వివాదంలో మధుబాబు ప్రత్యర్థులుగా ఉన్న భాగస్తులు.. ప్రస్తుతం దారిస్థలంలో మధుబాబుకు ఎలాంటి హక్కు లేదన్నారు. ఆ స్థలం తమకు చెందినదని, తాము భాగాలు పెట్టుకుని సబ్‌డివిజన్ చేసుకుని క్రయవిక్రయాలు జరిపామన్నారు. కోర్టు కేసులో ఆస్తికి సంబంధించి తమ భాగస్తుల మధ్య వివాదం నడుస్తుంటే, కొంతకాలం క్రితం మధుబాబు అందులో ఇంప్లీడ్ పిటిషన్ ద్వారా చేరారన్నారు. తప్పితే అతడికి, దారి స్థలానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయమై టీడీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి మధుబాబు వివరణ ఇస్తూ.. తమకు, ఇతర భాగస్తులకు మధ్య ఆధిపత్యపోరులో రోడ్డును తవ్వాల్సి వచ్చిందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టాల్సిన అవసరం తనకు లేదన్నారు. తాను నిజాయితీపరుడునని, తన ఆస్తులను అమ్మి మరీ టీడీపీకి ఖర్చు చేశానని చెప్పుకొచ్చారు.


టీడీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి మధుబాబు రోజాఫ్లాట్స్‌కు వెళ్లే రహదారిని తవ్వేసిన దృశ్యం

వ్యాన్, ద్విచక్రవాహనం ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

రామాపురం : కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వలచెరువు బస్టాండ్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గొల్లపల్లికి చెందిన ప్రసాద్, గణేష్‌లు గువ్వలచెరువు నుంచి ఏపీ39 బీటీ 8313 టీవీఎస్ ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరారు. ఓ చోట మలుపు తిరుగుతుండగా ప్రొద్దుటూరు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ఏపీ39యుఎల్ 5931 నంబరు గల పందుల వ్యాను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ప్రసాద్, గణేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

తల్లీకొడుకుకు గాయాలు

మదనపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో తల్లీకుమారుడు గాయపడిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో ఆదివారం జరిగింది. బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప భార్య రామలక్ష్మమ్మ(57), కుమారుడు రెడ్డిశేఖర్‌లు ద్విచక్రవాహనంలో నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ ఎర్రాతివారిపల్లెలో ఆమె మనవడు వినయ్‌చంద్ పుట్టినరోజు వేడుకకు వెళ్లారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని ఆచార్లపల్లె వద్ద మరో ద్విచక్రవాహనం వీరిని ఢీకొనడంతో అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. ప్రమాదంలో రామలక్ష్మమ్మకు చేయి విరగ్గా, రెడ్డిశేఖర్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పాఠశాలల రూపురేఖలు మారాయి



నాడు–నేడు పథకం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. గతంలో విద్యార్థులు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. తరగతి గదులు, మరుగుదొడ్ల విషయంలో రాజీ పడకుండా కార్పొరేట్ స్థాయిలో నిర్మించడం హర్షనీయం.

– కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, వడ్డిపల్లి, ఓబులవారిపల్లి

ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు



గతంలో పాఠశాలలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడి ప్రైవేటు పాఠశాలలకు పంపేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు మా పిల్లలు వెళుతున్నారు. మంచి చదువు, భోజనం, పుస్తకాలు, బట్టలతో పాటు ప్రతి ఏడు నాకు అమ్మఒడి కింద రూ. 15వేలు వస్తుంది. మాలాంటి వారికి జగనన్న చేపట్టిన సంస్కరణలు ఎంతో మేలు చేస్తున్నాయి.

– ముత్తులూరు నాగరత్నమ్మ, లింగాలదిన్నెపల్లె బి.మఠం మండలం

మహిమాన్వితుడు కాశినాయన

- ఆధ్యాత్మిక నిలయం జ్యోతిక్షేత్రం
- రేపటి నుంచి కాశినాయన ఆరాధన మహోత్సవాలు
- భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు

కాశినాయన : జ్యోతిక్షేత్రం ఆధ్యాత్మిక నిలయంగా భాసిల్లుతోంది. ఈ క్షేత్రంలో శ్రీ అవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 26, 27 తేదీల్లో ఘనంగా జరగనున్నాయి. నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకా బెడుసుపల్లె గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన కాశినాయన చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక చింతనకు అలవాటు పడ్డారు. ఆయన గురువైన యతిరాజు గురవయ్య వద్ద ఆత్మజ్ఞానాన్ని పొందారు. అక్కడి నుంచి కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలో ప్రవేశించి వరికుంట్ల, నాయునిపల్లె, గంగనపల్లె గ్రామాలకు చేరుకున్నారు. అక్కడ కొన్ని సంవత్సరాల పాటు చిన్నపిల్లలకు విద్యాబోధన చేస్తూ ఆధ్యాత్మిక చింతనను కొనసాగించారు. ఆ సమయంలో వరికుంట్ల సమీపంలోని నల్లమల్ల కొండల్లోని జ్యోతిక్షేత్రంలో జ్యోతి నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ జ్యోతినరసింహస్వామికి పూజలు చేస్తుండేవారు. అక్కడికి సమీపంలోని గరుడాద్రి కొండ మీద కఠోర దీక్షతో తపస్సు చేశారు. అనంతరం అన్నదాన ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ వచ్చేవారు.

ఆలయాల పునరుద్ధరణకు కృషి


కాశినాయన సమాధి

అవధూతగా మారిన కాశినాయన శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణకు నడుం బిగించారు. చుక్కనీరు దొరకని గరుడాద్రి కొండమీద బావులు తవ్వించారు. గరుడాద్రి, అనంతరాయుడు, జ్యోతి, సిద్దేశ్వరం, లింగమయ్యకొండ, యోగానందలోని ఆలయాలను పునరుద్ధరించారు. కాశినాయన రైతు కుటుంబంలో జన్మించడంతో పశుపాలన, ధాన్యోత్పత్తి, ఆకలితో ఉన్న వారికి పిడికెడు అన్నం పెట్టడం అనే సుగుణాలు ఆయనకు అలవడ్డాయి. కర్నూలు జిల్లా నల్లమల్ల అడవుల్లో ఉన్న అహోబిలం వద్ద యోగానంద ఆశ్రమాన్ని స్థాపించి అక్కడ పశుసంపదను, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కాశినాయన సమాధి


కాశినాయన నిజస్వరూపం (ఫైల్‌ఫొటో)

వందేళ్లు జీవించిన కాశినాయన తన ఇష్టదైవమైన జ్యోతినరసింహస్వామి పాదాలచెంత 1995 డిసెంబర్ 5వ తేదీన సమాధి అయ్యారు. ఆయన సమాధి చెందిన ప్రాంతంలో ఒక పురాతన మర్రిచెట్టు తనంతట తానే నేలవాలింది. ఆయన సేవిస్తూ వస్తున్న గోమాత కాశినాయన మరణాన్ని జీర్ణించుకోలేక మూడవరోజున తనువు చాలించింది.

కాశినాయన ఆలయం

కాశినాయన సమాధిపై అద్భుతమైన దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. 60 తెలుగు సంవత్సరాలకు ప్రతీకగా 60 రాతిస్తంభాలతో 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా దేవాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆవు సమాధిని కూడా అందంగా నిర్మించారు. వంటశాలలు, భోజనశాలలు, వసతిగృహాల నిర్మాణాలతో జ్యోతిక్షేత్రం కళకళలాడుతోంది.

నిత్యాన్నదానం

కాశినాయన ఆశ్రమాన్ని దర్శించే భక్తులకు అక్కడ స్వామి దర్శనం ఎంత ఇష్టమో ఆశ్రమంలో భోజనం చేసి రావడం అంత పవిత్రం. ప్రతిరోజు వందల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని భోజనం చేస్తుంటారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో భక్తజనం లక్షల్లో వస్తుంటారు. ఏడాది పొడవునా అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతుంది. రైతులు తాము పండించిన పంటలో కాశినాయన పేరున తీసి ఉంచిన ధాన్యం, కూరగాయలు, పప్పుధాన్యాలు ఆశ్రమానికి తమకు తాముగా చేరవేస్తుంటారు. దీంతో అన్నదానం సజావుగా సాగుతుంది. ఈ నెల 26, 27వ తేదీల్లో కాశినాయన ఆరాధన మహోత్సవాలకు కడప జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మైదుకూరు ఆర్టీసీ డిపోవారు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోరుమామిళ్ల సీఐ చిరంజీవి ఆధ్వర్యంలో ఒక సీఐ, ఆరుగురు ఎస్‌ఐలు, 175 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాఫ్ట్ టెన్నిస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కడప స్పోర్ట్స్ : తమిళనాడు రాష్ట్రంలోని వేలూరులో త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. నవంబర్ 25, 26 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికల్లో కమలాపురానికి చెందిన ఎం. మోక్ష, కడప నగరానికి చెందిన ఎస్. యోజిత్‌నాథ్‌లు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికైనట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కడప క్రీడాకారుల ప్రతిభ


బాక్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి తదితరులు

కడప స్పోర్ట్స్ : ఈనెల 21న విశాఖపట్నంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. కడప నగరానికి చెందిన ఎన్. అనీష్ శైలేష్ కేడెట్ 22 కేజీల విభాగంలో స్వర్ణపతకం, సీనియర్ మహిళల 58 కేజీల విభాగంలో సి. రేణుక స్వర్ణపతకం సాధించారు. వీరితో పాటు సబ్‌జూనియర్ (58కేజీల) విభాగంలో ఎస్.సాయిరాహుల్ వెండిపతకం, కేడెట్ 25కేజీల విభాగంలో ఎన్. రేవత్ శైలజేష్, 28 కేజీల విభాగంలో డి.వి.ప్రణీత్, 31కేజీల విభాగంలో డి.వి. రోహిత్‌లు కాంస్య పతకాలు సాధించారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి అభినందించారు. జాతీయస్థాయిలో సైతం పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకుడు ఎస్.వి.పి. అమృత్‌రాజ్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. విజయ్‌భాస్కర్‌రెడ్డి, కోచ్ కె. గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి భజన పోటీలు ప్రారంభం

రాజుపాళెం : వెల్లాలలో హనుమద్ వ్రతాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి తాళ భజన పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఈఓ బీవీ నరసయ్య, సర్పంచ్ రాధా, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 42 భజన సంఘాలు పాల్గొన్నాయి. ఇక్కడికి వచ్చిన భక్తులకు బలరామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు, యువకులు వచ్చి తిలకించారు.

సమాజ హితమే రచయితల అభిమతం

- ఎలుగెత్తి చాటిన కలం యోధులు
- ముగిసిన జిల్లా రచయితల సంఘం సభలు


మాట్లాడుతున్న అవధాని మేడసాని మోహన్

కడప కల్చరల్ : పలు సాహిత్య ప్రక్రియల సమ్మేళనంగా ఏ ప్రక్రియ అయినా సమాజ హితం కోసమేనంటూ కవులు, రచయితలు ఎలుగెత్తి చాటారు. ప్రతి కలం సాటి మనిషికి సాయపడే కవిత్వాన్ని సృజించాలని కోరుతూ కవులు గట్టిగా తమ గళం వినిపించారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం రెండు రోజుల మహా సభల్లో భాగంగా ఆదివారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ముగింపు సభను నిర్వహించారు. సాహితీ సదస్సులు, అవధానుల స్వీయ అనుభవాలు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ వేదికపై రచయిత డాక్టర్ కొమ్మిశెట్టి మోహన్ అధ్యక్షతన కథా రచయిత దాదా హయాత్ ముఖ్య అతిథిగా సదస్సు జరిగింది. జిల్లా ఆధునిక పద్యకవిత్వం అంశంపై శతావధాని డాక్టర్ నరాల రామారెడ్డి, వైఎస్సార్ జిల్లా అవధానులు అనే అంశంపై అవధాని ఆముదాల మురళి, జిల్లా పత్రికారంగం అంశంపై డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, సాహిత్య విమర్శ అనే అంశంపై ఎస్.విజయభాస్కర్ పత్ర సమర్పణ చేశారు. అనంతరం శశిశ్రీ సభా వేదికపై డాక్టర్ వేంపల్లె షరీఫ్ అధ్యక్షతన ప్రముఖ కవి ఏసీ దస్తగిరి ముఖ్య అతిథిగా, జిల్లా జానపద సాహిత్యం అనే అంశంపై ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ జిల్లా నాటక సాహిత్యం అనే అంశంపై డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, ముస్లిం వాద సాహిత్యం అనే అంశం డాక్టర్ తవ్వా వెంకటయ్య, దళితవాద సాహిత్యంపై డాక్టర్ కోడూరు స్వతంత్రబాబు పత్ర సమర్పణలు చేశారు. గానుగపెంట హనుమంతరావు అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ముఖ్య అతిథులుగా ప్రసిద్ధ అవధానులు డాక్టర్ నరాల రామారెడ్డి, డాక్టర్ మేడసాని మోహన్, ఆముదాల మురళి, లోకా జగన్నాథశాస్త్రి తమ అనుభవాలను సభికులతో పంచుకున్నారు. సంఘం అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో రాచమల్లు రామచంద్రారెడ్డి సభా వేదికకు రచయిత షేక్ హుసేన్ సత్యాగ్ని అధ్యక్షత వహించగా, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, విద్యావేత్త లయన్ ఖాసింఖాన్‌ల ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన కవులు కవితాగానం చేశారు. అనంతరం కవులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : అదనపు వరకట్నం వేధింపులపై రెండు కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ ఆదివారం మీడియాకు తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీకి చెందిన సావిత్రి(33)కి పూలనాగరాజుతో 15ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. సావిత్రిని భర్త పూలనాగరాజు, అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం తేవాలంటూ ఇటీవల కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలు శనివారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, ఆమె భర్త నాగరాజుతో పాటు కుటుంబ సభ్యులైన మరో 10మందిపై అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లెకు చెందిన లావణ్య(23)ను ఆమె భర్త, అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధించగా, బాధితురాలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త పురుషోత్తం, అతడి కుటుంబ సభ్యులు ఐదుగురిపై అదనపు వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లీబిడ్డలు కుటుంబ సభ్యులకు అప్పగింత

కలికిరి : మదనపల్లి మండలం కొత్తవారిపల్లికి చెందిన నిరంజన్ భార్య మౌనిక భర్తపై అలిగి ఈ నెల 7న ఇంటి నుంచి పుట్టింటికి వచ్చింది. అక్కడ పుట్టింటి వారికి భారం కాకూడదని తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఈ నెల 9న హైదరాబాదుకు చేరుకుంది. అక్కడ కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటోంది. కాగా తన కుమార్తె, ఆమె పిల్లలు శిరీషా, సౌజన్య కనపడటం లేదని ఈ నెల 12న మౌనిక తల్లి శ్రీదేవి కలికిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మౌనిక, పిల్లలు హైదరాబాదులో ఉన్నట్లు గుర్తించి తీసుకువచ్చారు. తహసీల్దార్ ఎదుట హాజరుపరచి మౌనిక తల్లిదండ్రులకు అప్పగించారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం

కలికిరి : బెంగళూరు నగరం మారతహల్లి ప్రాంతానికి చెందిన మునికుమార్, సుజాతల కుమారుడు కార్తీక్ మూడవ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో తల్లిదండ్రులపై అలిగి అక్కడి నుంచి పీలేరుకు వచ్చేశాడు. ఆదివారం ఉదయం పీలేరు నుంచి నడుచుకుంటూ కలకడ వైపు వెళుతుండగా మార్గమధ్యంలో ఈతమానువడ్డిపల్లి వద్ద స్థానికుడు చక్రవర్తి బాలున్ని గుర్తించి విచారించాడు. కార్తీక్ తనది బెంగళూరుగా చెప్పాడు. దీంతో చక్రవర్తి కలికిరి పోలీసులకు సమాచారమిచ్చి పోలీసుల వద్దకు చేర్చాడు. విచారించిన పోలీసులు బాలుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సాయంత్రం బాలుని తాత మోహన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాలున్ని తీసుకెళ్లారు.

బలిజల ముసుగులో టీడీపీ దిగజారుడు రాజకీయాలు

ఉత్తర అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రతినిధి పండుగాయల రత్నాకర్


మాట్లాడుతున్న పండుగాయల రత్నాకర్

రాజంపేట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బలిజల ముసుగులో తెలుగుదేశం పార్టీ చేస్తున్న దిగజారుడు రాజకీయాలను ఆ సామాజిక వర్గం వారు ఈసడించుకుంటున్నారని ఉత్తర అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బలిజలకు టీడీపీలో పదవులేకాదు, కనీస గౌరవం కూడా లేదన్నారు. బలిజలంతా ముక్తకంఠంతో మా నమ్మకం నువ్వే జగన్, నిన్ను నమ్మేది లేదు బాబు అంటున్నారని చెప్పారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తన లాంటి ఓ సామాన్యుడిని కేబినెట్ పదవిలో కూర్చోబెట్టగలిగిన చిత్తశుద్ధి, సత్తా ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. కడప నగరానికి చెందిన సి.రామచంద్రయ్యను ఎమ్మెల్సీగా, గురుమోహన్‌ను అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా, మర్రి రవిని రాజంపేట మున్సిప్ వైస్‌చైర్మన్‌గా, పోరుమామిళ్లకు చెందిన డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తిని ఆప్కాస్ డైరెక్టర్‌గా నియమించారన్నారు. త్వరలోనే బలిజలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కాబోతోందన్నారు.

బలిజల మద్దతు వైఎస్సార్‌సీపీకే

కడప కార్పొరేషన్ : బలిజల మద్దతు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీకే ఉంటుందని కడప పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) చైర్మన్ సింగసాని గురుమోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బలిజ సంఘనేతలు తోట క్రిష్ణ, చెన్నంశెట్టి మురళీ క్రిష్ణ, కోలా కొండయ్యలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు తమ మద్దతు లేదని కొందరు బలిజ సంఘం పేరుతో ప్రకటించడం తగదన్నారు. ఒక కులమంతా ఒకే పార్టీకి మద్దతు ఇస్తుందని చెప్పడం సరికాదన్నారు.